క్లుప్తంగా

ఆలయ నూతన కార్యవర్గ ఎన్నిక

మార్కాపురం టౌన్: స్థానిక అమలక లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ డీవీ కృష్ణారెడ్డి, అధ్యక్షురాలిగా గోళ్ల వరలక్ష్మిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా రిటైర్డు ప్రిన్సిపాల్ జి.వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కందుల వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా సీహెచ్ మల్లారెడ్డి, గౌరవ సలహాదారునిగా రిటైర్డు హెడ్ మాస్టర్ వై.సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎస్.యోగిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, బి.శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, జి.నాగదివ్యను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

సీఎం సిఫార్సు చేసినా న్యాయం జరగలేదు

● విశ్రాంత వీఆర్‌ఓ మునిరెడ్డి ఆవేదన

మార్కాపురం: మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలో కొన్నేళ్లుగా ఉన్న తన భూసమస్యను పరిష్కరించాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అర్జీ ఇచ్చానని, సీఎం నుంచి సిఫార్సు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని మార్కాపురం విశ్రాంత వీఆర్‌ఓ మునిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీపైనే స్పందన లేకుంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని తాను సీఎం దృష్టికి మళ్లీ తీసుకెళ్తానని పేర్కొన్నారు.

తురిమెళ్ల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డు

కంభం: మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు దక్కాయని ప్రధానోపాధ్యాయుడు శివ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయతను వెలికి తీసి వారిని బాలశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర శాస్త్రీయ సాంకేతిక మండలి ఇన్‌స్పైర్ అవార్డులు అందిస్తోంది. అందులో భాగంగా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చిన్న స్వాతి, ఎడవల్లి వెంకటదివ్యకు అవార్డులు దక్కాయని, విద్యార్థినులకు రూ.1000 ప్రోత్సాహక నగదు అందించనున్నట్లు తెలిపారు.

బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో పాఠశాలలోని సుమారు 800 మంది విద్యార్థినులు రోజూ మధ్యాహ్న భోజన సమయం, ఇంటర్వెల్‌లో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి తాగునీటి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేసవి కాలం కావడంతో ఇంటి నుంచి బాటిల్‌లో తెచ్చుకున్న నీరు కొద్దిసేపటికే అయిపోతున్నాయి. దీంతో తాగేందుకు నీరు లేక గొంతు ఎండుతోందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు తాగునీటి సమస్య ఏర్పడినప్పుడు వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసి నీటి సమస్య తీర్చారు. అయితే ఇటీవల ఆ ఫిల్టర్ మరమ్మతులకు గురైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించడమో లేదా మున్సిపల్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని బాలికలు కోరుతున్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల నిరసన



బ్యాంకు ఉద్యోగుల నిరసన

మార్కాపురం: తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఎస్‌బీఐ ఉద్యోగులు పట్టణంలోని తమ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగుల ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని, వారంలో ఐదురోజులు బ్యాంకు పనిదినాలుగా మార్చాలని కోరారు. ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణను వ్యతిరేకస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ యూనియన్ల ప్రతినిధులు జి.సురేష్‌బాబు, కె.కాశిరెడ్డి, ఎం.రమణారెడ్డి, షేక్ గౌస్‌బాషా, టి.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి ఉచిత వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గిద్దలూరు రూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆవరణలో శుక్రవారం 100 మందికి ఉచిత వైద్యసేవలు అందించారు. మహిళా దినోత్సవం సందర్భంగా బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ ఆదాం, డాక్టర్ ఆషియా పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రామారావు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రియమైన ముఖ్యమంత్రి గారూ..



- వెలిగొండ ప్రాజెక్టు, ఆర్‌ఆర్ ప్యాకేజీపై స్పష్టత ఇస్తారా?
- మార్కాపురంలో షాదీఖానాకు మోక్షం కలిగేనా?
- చెరువుకట్ట రోడ్డు మినీ ట్యాంక్‌బండ్‌గా మారేనా?
- పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటయ్యేనా?



అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ హాస్టల్

మార్కాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మార్కాపురం నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నాడు కందుల నారాయణరెడ్డితో కలిసి ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. శనివారం మహిళా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి మార్కాపురం పర్యటనకు వస్తున్న చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు మిగులు పనులు, ఆర్‌ఆర్ ప్యాకేజీ నిధుల మంజూరుపై కొంత కాలంగా ప్రజలతోపాటు నిర్వాసిత గ్రామాలవారు నిరసన తెలుపుతున్నారు. ఎన్నికల వేళ కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేసిన, సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన 'మహిళలకు ఉచిత బస్సు' హామీని అమలు చేయాలన్న డిమాండ్ మార్కాపురం నియోజకవర్గ మహిళల నుంచి వస్తోంది. ఇదిలా ఉండగా నియోజకవర్గ కేంద్రమైన మార్కాపురంతోపాటు తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో పలు సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయి. ఆయా సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిలిచిపోయిన షాదీఖానా భవనం

ప్రధాన సమస్యలు ఇవిగో..

- మార్కాపురం పట్టణం నుంచి ప్రధానమైన రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు(చెరువుకట్ట రోడ్డు)ను డబుల్ రోడ్డుగా మార్చి ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.
- మార్కాపురం పట్టణంలో సుమారు 15 వేల మందికి పైగా ముస్లింలు ఉన్నారు. వీరి సంక్షేమం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2 కోట్ల రూపాయలతో షాదీఖానా నిర్మాణం ప్రారంభించగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. దీన్ని పూర్తి చేయాలని ముస్లింలు కోరుతున్నారు.
- మార్కాపురం-తర్లుపాడు రోడ్డు గుంతలు పడి దారుణంగా తయారైంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతోపాటు తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలని ప్రజలు విన్నవిస్తున్నారు.
- మార్కాపురం పట్టణంలో శాశ్వతంగా బీసీ బాలికల వసతి భవనాన్ని ఏర్పాటు చేయాలి.
- పొదిలి పట్టణంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినా, మంజూరు కాలేదు. ఈ ప్రాంతంలో సుమారు 3 వేల వరకు బ్యార్లీలు ఉన్నాయి. ఏటా అగ్నిప్రమాదాలు సంభవిస్తూ ఆస్తి నష్టం జరుగుతోంది.
- పొదిలి పట్టణానికి సాగర్ నీటిని అందించేందుకు గత ప్రభుత్వంలో రూ.50 కోట్లతో చేపట్టిన పనులు కొద్ది నెలలుగా నిలిచిపోయాయి. దర్శి సాగర్ కెనాల్ నుంచి పొదిలి వరకు పైప్ లైన్ పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటు పొదిలి పెద్ద చెరువును ఎస్‌ఎస్ ట్యాంక్‌గా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
- ట్రిపుల్ ఐటీ కేంద్రాన్ని మార్కాపురంలో ఏర్పాటు చేసినట్లయితే జిల్లాతో పాటు పశ్చిమ ప్రకాశం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుందని విద్యావేత్తలు కోరుతున్నారు.
- మండల కేంద్రమైన తర్లుపాడులో బీసీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయి.

ఆర్వోబీ, ఆర్టీసీ కోసం ఎదురుచూపులు



రైల్వే గేటు పడటంతో వేచి ఉన్న వాహనాలు

తర్లుపాడు: మార్కాపురం పట్టణానికి సమీపంలో ఉన్న తర్లుపాడు వాసులను పలు సమస్యలు దీర్ఘకాలికంగా వేధిస్తున్నాయి.

- మండలంలో 16 పంచాయితీలు ఉండగా సుమారు 12 పంచాయతీలకు ఇప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ప్రజలు ఆటోలపైనే ఆధారపడుతున్నారు.
- తర్లుపాడు పట్టణ ప్రవేశమార్గంలో రైల్వే గేటు ఉండటంతో రోజూ సుమారు 20 సార్లు రైళ్లు, గూడ్స్‌ల రాకపోకల సమయంలో గేటు వేస్తుండటంతో ప్రజల విలువైన సమయం వృథా అవుతోంది. తరచూ రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- పేరుకు మండల కేంద్రమైనప్పటికీ ఇప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రధానంగా బీసీ హాస్టల్ ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. శిథిలావస్థకు చేరిన భవనంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత భవనం కావాలని కోరుతున్నారు.
- జూనియర్ కళాశాల లేకపోవడంతో మండలంలో ఉన్న సుమారు 100 మంది విద్యార్థులు రోజూ మార్కాపురం లేదా కంభం వెళ్లి ప్రైవేట్ కళాశాలలో చదువుకుంటున్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కాపురానికి సీఎం.. తర్లుపాడు రోడ్డుకు మోక్షం!



మార్కాపురం-తర్లుపాడు రోడ్డు మొన్నటి వరకు అలా..



సీఎం పర్యటన నేపథ్యంలో ఇప్పుడు ఇలా..

తర్లుపాడు: సీఎం చంద్రబాబు శనివారం మార్కాపురం పర్యటనకు వస్తుండటంతో తర్లుపాడు రోడ్డుకు ఒక్కసారిగా మోక్షమొచ్చింది. మార్కాపురం పట్టణ శివారులోని తర్లుపాడు రోడ్డులో సభా ప్రాంగణం, హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. ఆ మార్గం గుండా సీఎం కాన్వాయ్ రావాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, మరమ్మత్తులు చేయాలని కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. సీఎం పర్యటన ఖరారు కాగానే ఆర్‌అండ్‌బీ అధికారులు ఆగమేఘాల మీద తారు, కంకర తెచ్చి బుల్డోజర్లతో రాత్రికి రాత్రే రోడ్డు వేశారు. శుక్రవారం ఉదయం ఈ రహదారిలో వెళ్లే ప్రజలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. రాత్రిలేని కొత్త రోడ్డు ఉదయానికల్లా ఎలా వచ్చిందబ్బా అంటూ చర్చించుకున్నారు.

ముగిసిన అమలక లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రవచనం చేస్తున్న రామానుజ జీయర్ స్వామి, పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో అమలక లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. లక్ష్మీదేవి తిరుమంజనం, సామూహిక లక్ష్మీపూజ, కుంకుమార్చన బ్రహ్మోత్సవ పూర్ణాహుతి, శ్రీచక్రస్నానం, సప్తవర్ణాలతో కూడిన పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు తీర్థగోష్ఠి, అన్నసంతర్పణ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చంద్రబాబు హామీలు నిలబెట్టుకోవాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: అధికారంలోకి రాగానే వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తానని, మార్కాపురాన్ని జిల్లా చేస్తానని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని, వాటిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సోమయ్య మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి ఉన్న ఏకైక మార్గం వెలిగొండ ప్రాజెక్టు మాత్రమేనని, వచ్చే వరద సీజన్ నాటికి వెలిగొండ నీరు ప్రజలకు అందించాలని కోరారు. బడ్జెట్‌లో సవరణ చేసి ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి, మెడికల్ కాలేజీని ప్రభుత్వమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీకేఎం రఫీ, జి.బాలనాగయ్య, రూబెన్, నన్నేసా, నాగరాజు, విక్టర్, మల్లికార్జున, నాగయ్య, రాజబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

రంగస్వామి దేవస్థానం ఈవోగా నాగయ్య



నాగయ్య

రాచర్ల: నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా మల్లావరపు నాగయ్య శనివారం పూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన బాపట్ల జిల్లా చెరుకూరు గ్రామ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తూ గ్రేడ్-1 ఈఓగా పదోన్నతి పొందారు. బదిలీపై రంగస్వామి దేవస్థానానికి వచ్చారు. ప్రస్తుతం రంగస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన బి.రమేష్‌ను టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలోని వల్లూరమ్మ దేవస్థానానికి రెగ్యులర్ ఈవోగా నియమించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్దిపాడు: ఈ నెల 8 నుంచి పృథులగిరి లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని కార్యనిర్వాహణాధికారి నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న అంకురార్పణ. 9న ధ్వజారోహణ, శేషావాహనం, 10న హంసవాహనం, 11న సింహవాహనం, 12న హనుమంతుని వాహనం, 13న గరుడవాహనసేవా, 14న స్వాముల వారి కల్యాణం, 15న రథోత్సవం, 16 న అశ్వవాహనం, 17న పూర్ణాహుతి, 18న ఏకాంత సేవా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 13న గరుడ వాహనం రోజున జరుగు తిరుణాళ్ల ఉత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో పాల్గొంటారు. భక్తుల కోసం భోజన వసతి, తాగునీరు, బారికేడ్లు, ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు.

27న దండోరా ప్రభంజనం సభ



నినాదాలు చేస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 27న గన్నవరంలో దండోరా ప్రభంజనం సభ నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మాదిగ రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నియమించిన రంజన్ కమిషన్ వేగంగా నివేదిక సమర్పించాలని, ప్రస్తుత శాసనసభ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. ఏప్రిల్‌లో వర్గీకరణ అమలులోకి తేవాలన్నారు. గతంలో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించారన్నారు. దీంతో మాదిగ ఉపకులాలకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు వచ్చాయన్నారు. డీఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియామకాల్లో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చాట్ల డానియేల్, జాన్, జి.పాపయ్య, గుడిపాటి బాబు, మార్కాపురం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు బూదాల గురవయ్య, పుష్పాళ్ల అనిల్, కె.చిన్నా, మోహన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పనిముట్ల కోసం దరఖాస్తులు

టంగుటూరు: కులవృత్తులు చేసే వారు వారికి కావాల్సిన పనిముట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దేవసేన కుమారి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కులవృత్తి సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదరణ-3 పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కులవృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల ధ్వంసం-ఆయిల్ చోరీ

టంగుటూరు: ఎత్తిపోతల పథకం విద్యుత్ పరికరాలను ఆయిల్‌ను చోరీ చేశారు. ఈఘటన మండలంలోని పొందూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మక్కపాలెం సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎత్తిపోతల పథకం గతి కొన్నేళ్లుగా పొగాకు, శనగ, తదితర పంటలకు నీరు అందిస్తోంది. శుక్రవారం ఉదయం రైతులు ఎత్తిపోతల పథకం వద్దకు పోగా అక్కడ విద్యుత్ పరికరాలు ధ్వంసం చేసి ఉండటం గమనించారు. దీంతో అందులోని ఆయిల్‌ను దొంగలు అపహరించుకుపోయారని గుర్తించారు. పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అధికారులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. దీనిపై టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు వివరణ కోరగా శుక్రవారం ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.